www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 14 మార్చి 2025



15న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమావేశం ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు జడ్‌పి సిఇఒ వివిఎస్.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అయ్యే ఈ సమావేశం పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బడ్జెట్‌పై ప్రత్యేక చర్చ ఉంటుందన్నారు. చర్చ అనంతరం బడ్జెట్ ఆమోదం, ఇతర సమస్యలపై చర్చ ఉంటుందని అన్నారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలతోపాటు, జడ్‌పిటిసిలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కావున అధికారులు విధిగా హాజరుకావాలని సిఇఒ కోరారు.

కిడ్నీ రోగుల పరిస్థితి దయనీయం

- జిజిహెచ్‌లో సరైన వైద్యం కరువు
- కానరాని నెఫ్రాలజిస్ట్ నిపుణులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కొన్ని జబ్బులు శరీరకంగానే కాదు మానసికంగానూ మనుషుల్ని కుంగదీస్తాయి. అలాంటి వాటిలో కిడ్నీల వ్యాధి ఒకటి. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన సామాన్యులకు కిడ్నీల సమస్య వస్తే వీరి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. రోజురోజుకి పెరుగుతున్న ఈ రోగులు జిల్లా కేంద్రంలో ఉన్న కాకినాడ జిజిహెచ్‌కు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. అనేకేళ్లుగా సంబంధిత స్పెషలిస్ట్ డాక్టరు లేకపోవడంతో కిడ్నీ రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి, అనకాపల్లి జిల్లాల నుంచి వివిధ జబ్బులకు వైద్యం నిమిత్తం ప్రతిరోజూ 3 వేల మంది రోగులు ఇక్కడకు వస్తున్నారు. వీరిలో కిడ్నీ రోగులు కూడా అధికంగానే ఉంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో వేలకు వేలు సొమ్ములు చెల్లించలేని సామాన్యులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వస్తున్నారు. అయితే ఇక్కడ కిడ్నీ వ్యాధికి వైద్యం చేసేందుకు సంబంధిత స్పెషలిస్ట్ లేకపోవడంతో సదరు రోగులకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో పలువురికి డయాలసిస్ చేయించుకునే స్థాయి వరకూ రోగం ముదిరిపోతుంది.

సామాన్యులకు వ్యయ, ప్రయాసలు

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది కిడ్నీ రోగుల పరిస్థితి. జిజిహెచ్‌లో కేవలం యురాలజీ, మెడిసిన్ డాక్టర్లు మాత్రమే కిడ్నీ వ్యాధులకు కూడా వైద్యం చేయడం వలన సదరు వైద్యులపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీనికితోడు నయం కావాల్సిన జబ్బు మరింతగా పెరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా కిడ్నీ సంబంధిత వ్యాధి వచ్చినపుడు జిజిహెచ్‌లో రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. సరైన సమాచారం ఇచ్చే నాథుడు కరువవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ప్రయివేటు ఆసుపత్రులలో చూపించుకున్న పలువురు రోగులకు కిడ్నీ వ్యాధి ముదిరి పోవడంతో ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ చేయించుకోవాలని అక్కడి వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం 125 మంది ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్నారు. అయితే ఖర్చుతో కూడుకున్న డయాలసిస్ కోసం అనేక మంది వ్యాధిగ్రస్తులు జిజిహెచ్‌కు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి సరైన సమాచారం ఇవ్వడంతో ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక వైద్యుడు అవసరం

మూత్ర పిండాలు వైఫల్యం చెందడం వలన ఈ వ్యాధి తీవ్రత అంతకంతకు పెరుగుతూ వస్తోంది. రక్తం నుంచి విష పదార్థాలు, వ్యర్థ పదార్థాలను కిడ్నీ తగిన స్థాయిలో వడపోయడంలో విఫలమైనపుడు రోగి పరిస్థితి క్షీణిస్తుంది. రెండు దశల్లో తీవ్రస్థాయి (తీవ్ర మూత్రపిండ గాయం), దీర్ఘస్థాయి (దీర్ఘ మూత్రపిండ వ్యాధి) గా మారుతుంది. ఈ నేపథ్యంలో జిజిహెచ్‌లో సంబంధిత ప్రత్యేక వైద్యుడు ఉంటే రోగ తీవ్రత స్థాయిని తగ్గించే అవకాశం ఉంటుంది. కిడ్నీ సంబంధిత వ్యాధి వచ్చినపుడు సదరు డాక్టరు పరిశీలించి వైద్యం అందించడం ద్వారా డయాలసిస్ బాధితులను కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ప్రయివేటు ఆసుపత్రులలోనూ జిజిహెచ్‌తో పాటు జిల్లాలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కిడ్నీ స్పెషలిస్ట్ లేకపోవడంతో డయాలసిస్ చేయించుకునే రోగులు అధికమై ప్రభుత్వంపై ఆర్థికంగా భారం కూడా పెరుగుతుంది. అయితే కాకినాడలోని ఒక ప్రయివేటు ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ ఇక్కడకు 15 రోజులకొకసారి వచ్చి సేవలు అందిస్తున్నారు. దీంతో అనేకమంది రోగులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. ప్రతి రోజూ హెచ్‌ఐవి, హెచ్‌బివిఎసిజి రోగులకు విడివిడిగా 20 నుంచి 30 మందికి డయాలసిస్ చేస్తున్నారు. కొన్ని సేవలకు ప్రత్యేక వైద్యులను జిజిహెచ్‌కు రప్పిస్తున్న అధికారులు కిడ్నీ వ్యాధి ప్రత్యేక వైద్యుడిని కనీసం వారంలో ఒక రోజయినా ఇక్కడకు రప్పించాలని రోగులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు కిడ్నీలూ దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా ఉంటుంది. ఎన్నో వ్యయ, ప్రయసలు పడుతూ ఇక్కడకు వస్తున్నారు. కోనసీమ, మెట్ట వంటి సుదూర ప్రాంతాల నుంచి రావడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికయినా జిల్లా కలెక్టర్ స్పందించి కిడ్నీ రోగుల సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని అంతా వేడుకుంటున్నారు.



చిత్రాడకు వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

నేడు జనసేన జయకేతనం సభ

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం జనసేన పార్టీ 14వ ఆవిర్భావ 'జయకేతనం' సభ నేడు చిత్రాడ గ్రామంలోని ఎస్‌బి వెంచర్‌లో జరగనుంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఈ సభను భారీ స్థాయిలో జరిపేలా ఏర్పాట్లు చేశారు. వివిధ నిర్వహణ కమిటీలను వేసి బాధ్యతలు అప్పగించారు. సభ ప్రాంగణం డెకరేషన్, వేదిక ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే వారికి కోసం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా మంచినీరు, మజ్జిగ, ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 7 వైద్య శిబిరాలు, 14 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. జయకేతనం సభకు పార్టీ మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలతోపాటు, రాష్ట్ర నలుమూలల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి సైతం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రానుండటంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు1600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. 75 సిసి కెమెరాలు, రోడ్డుకు ఇరువైపులా, సభ ప్రాంగణంలో ఎల్‌ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకుల ఉపన్యాసాలు ఉంటాయి. సాయంత్రం జనసేన అధినేత, ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు. కాకినాడ - కత్తిపూడి మధ్య గల 216వ జాతీయరహదారిపై శుక్రవారం ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకూ ట్రాఫిక్‌ని మళ్లించారు. సభకు వచ్చే వారికి ఎక్కడికక్కడ మంచినీరు, మజ్జిగ వంటివి అందించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేశారు.

ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలి

యు.కొత్తపల్లి చిత్రాడలో శుక్రవారం నిర్వహిస్తున్న జనసేన ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిఠాపురం జనసేన జనసేన నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, వి.ధనబాబు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సభలో డిప్యూటీ సిఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తోపాటు, ఇతర ముఖ్యనేతలు పాల్గొంటారని, కావున ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. **కాజులూరు** నేడు చిత్రాడలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన నాయకులు, ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ దేగల నాగేంద్ర గురువారం ఒక ప్రకటనలో కోరారు. మండలం నుంచి జనసేన ఆవిర్భావ దినోత్సవానికి వెళ్లే ప్రతి కార్యకర్తకు తన వంతుగా పెట్రోల్ కూపాన్ అందజేస్తున్నట్లు చెప్పారు. కూపన్ తీసుకుని గొల్లపాలెంలో పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకోవాలని ఆయన కోరారు.



విద్యుత్ కాంతులతో సభా వేదిక

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - కరప

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన నలుగురు విద్యార్థులకు హెచ్‌ఎం మార్ని శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలవడం ఆనందకరంగా ఉందన్నారు. భవిష్యత్‌లోనూ మరింతగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టాండర్స్ క్లబ్ మెంటర్, ఉపాధ్యాయులు మహబూబ్ అలీ షేక్, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీ రామచంద్రమూర్తి, ఎన్ ప్రసాద్ కుమార్, వి.రామమోహన్ పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ చర్చిలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సంఘ కాపరి రెవ. డాక్టర్ బి.కిరణ్‌కుమార్, సంఘ అధ్యక్షులు బిఎస్.వందనం ప్రారంభించారు. కంటి వైద్యులు డాక్టర్ కె.భవాని బృందం కంటి పరీక్షలను నిర్వమించారు. ఈ సందర్భంగా 30 మందికి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారిని కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు వైద్యులు భవాని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఇ.జీవన్‌కుమార్, అందుగుల రాధాకృష్ణ, టి.అమర్‌కిరణ్, డాక్టర్ సూరిబాబు, అందుగుల వీర్రాజు,కిరణ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ ఎస్‌వి.రమణ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ కార్మిక జెఎసి చేపట్టిన ఆందోళన గురువారానికి 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు కె.త్రిమూర్తులు, యుబిఎం.కుమార్, నేకూరి ప్రసాద్ మాట్లాడుతూ గత 20 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. టిన్ డ్రైవర్స్ వద్ద రూ.200 పైగా తేడా వస్తే ఐదు రెట్లు అధికంగా జరిమానా వేయాలనే నిబంధనను తుంగలోకి తొక్కి కక్షపూరితంగా డ్రైవర్‌ను సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఆర్‌టిడి చట్టం 1/2019కు వ్యతిరేకంగా ప్రవర్తించిన ఏలేశ్వరం డిపో మేనేజర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, డ్రైవర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్, ఎన్‌ఎంయు, యునైటెడ్ వర్కర్స్ యూనియన్‌లకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.



డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కోటనందూరు, తుని

వివిధ శాఖల్లో పని చేస్తున్న స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సత్తిరాజు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కట్ట సురేష్‌కుమార్ కోరారు. గురువారం స్థానికంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యలను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. అనంతరం యూనియన్ నేతలను స్కీం వర్కర్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు గోవింద్, ట్రాన్స్‌పోర్ట్ నాయకులు బాబురావు, రుఫీ, మమతా హాస్పిటల్ సిఇఒ వికాస్‌కుమార్, ఎండి జగపతిరాజు, సిఐటియు నాయకులు నక్కల శ్రీనివాస్, కామేశ్వరి, అంగన్‌వాడీ, ఆశ , మిడ్ డే మిల్స్ కార్మికులు పాల్గొన్నారు. అలాగే తునిలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు అమ్మ తల్లి, లాయర్లు విజయలక్ష్మి, ప్రసన్న, శ్యామల, ధనలక్ష్మి, బ్రహ్మనాయుడు, మమత హాస్పిటల్ ప్రతినిధి నాని పాల్గొని మాటలాడారు. ఈ కార్యక్రమంలో. సిఐటియు నాయకులు శ్రీనివాస్, సాత్విక దేవి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కోటనందూరులో మహిళలను సత్కరిస్తున్న నిర్వాహకులు

బోధ నివారణకు మందుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

బోధ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నివారణకు అవసరమైన మందులు పంపిణీ జరుగుతుందని జాతీయ బోదవ్యాధి నివారణ కేంద్రం హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.రామారావు అన్నారు. గురువారం బోద నివారణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బోధవ్యాధి కొత్తగా సోకే వారిని గుర్తించేందుకు నెలలో ఒక రోజు ఏదో ఒక ప్రాంతంలో రాత్రి సమయంలో రక్త నమోనాలు సేకరించి పరీక్షలు జరుపుతున్నామన్నారు. ఈ నెలలో పట్టణ పరిధిలోని తాడితోట, మిరపకాయల వీధిలలో 348 మంది రక్త నమూనాలు సేకరించి పరీక్షించామని అన్నారు. పట్టణ పరిధిలో బోధవ్యాధి కేసులు నమోదు కావడం లేదన్నారు. గతంలో బోధవ్యాధికి గురైన 417 మంది రోగులు రెగ్యులర్‌గా మందులు వాడుతున్నారన్నారు. పట్టణ పరిధిలో మురికి కాలవలలో బోధవ్యాధిని కలిగించే దోమల లార్వా నిర్మూలనకు మందు పిచికారి చేసేందుకు గతంలో ఆరుగురు సిబ్బంది ఉండేవారన్నారు.



వైద్య సేవలందిస్తున్న వైద్యులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ విద్య

ప్రజాశక్తి - తొండంగి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ విద్యను అందిస్తున్నామని, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కోరారు. గురువారం మండలంలోని కె.పెరుమాళ్లపురంకు చెందిన అధ్యాపకులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళశాలలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులే ఉంటాయని, అన్ని వసతులతో పాటు లాబొరేటరీస్ ఉన్నాయని,ఉత్తమ విద్య బోధిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో జె.శ్రీనుబాబు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - కరప

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఇంటర్మీడియట్ రీజనల్ జెడి జి.నాగమణి అన్నారు. గురువారం గురజానపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు తన సొంత నిధులు సుమారు రూ.70 వేల గాంధీజీ, అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకష్ణన్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆయా విగ్రహాలను జెడి నాగమణి, పబ్బినీడి వెంకటకృష్ణ, కర్నాసుల పుష్పరాజ్, పబ్బినీడి పాపారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పాఠశాల హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు ప్రతీ ఏడాది ఒక నెల జీతం సమాజ సేవకు ఖర్చు చేయడం అభినందనీయమని అన్నారు. సుమారు రూ.1.50 లక్షలతో పాఠశాలలో వివిధ సౌకర్యాల ఏర్పాటుకు ఖర్చు చేయడం ఆయన సేవా నిరతిని తేటతెల్లం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్‌ఎంసి ఛైర్మన్ పి.నూకరాజు, ఎంపిటిసి సభ్యులు వై.వీరవేణి, ఎంఇఒలు కెబి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ, కెవివి సత్యనారాయణ, యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాకాడ వెంకటరమణ, పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఇండిక్ యాప్ పొలంబడిలో 14 వారాలు క్రమం తప్పకుండా రైతులు అధికారులు చెప్పిన సూచనలు పాటించి అధిక దిగుబడులు తక్కువ ఖర్చుతో పొందాలని వ్యవసాయ శాఖ జెడి ఎం.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నవర గ్రామంలో వ్యవసాయ శాఖ ఎఒ ఇమిడిశెట్టి సత్య అధ్యక్షతన ఇండికా పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రతివారం క్రమం తప్పకుండా పొలంబడి శిక్షణ తరగతులు హాజరై నూతన సాంకేతిక శాస్త్రీయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పొలంబడిలో రబీ సీజన్లో 15 మంది రైతులతో ఆర్గానిక్ సర్టిఫికేషన్ రిజిస్ట్రేషన్ మళ్ళీ చేయించడం జరుగుతుందని, దీనివల్ల రైతు ఒక ఏడాది పాటు తను పండించిన ధాన్యాన్ని పూర్తిగా నాచురల్ ఫార్మింగ్‌లో వచ్చిన ధాన్యాన్ని బియ్యంగా చేసుకుని సొంతంగా అమ్ముకోవడానికి ఉపకరిస్తుందని తెలిపారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నవర ఎఇఒ గుడివాడ నాగేశ్వరరావు, వెన్న వీరవెంకటసత్యనారాయణ, కేశవరపు సురేష్, పడాల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జెడి

'యువత పోరు' విజయవంతం


ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమం విజయవంతం అయిందని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. అనారోగ్యానికి గురియైన వైసిపి సీనియర్ నాయకుడు దలే చిట్టిబాబును గురువారం పరామర్శించారు. అనారోగ్యం నుంచి త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి ఇచ్చిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జల్లిగంపల ప్రభాకర్‌రావు, ఏనుగు శ్రీను, గుడాల వెంకటరత్నం, గొల్లపల్లి దొరబాబు, శేరు కృష్ణ పాల్గొన్నారు.



వైసిపి నాయకుడిని పరామర్శిస్తున్న గిరిబాబు

కార్టూ'నిజం'



డిఎస్ఆర్ మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం



లక్కీడిప్ విజేతలకు హెల్మెట్ అందిస్తున్న తహసిల్దార్ త్రినాధరావు.

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు పుట్టినరోజు పురస్కరించుకుని సీతారామ పురంలో మెగా క్రికెట్ టోర్నీని గురువారం తహశీల్దార్ పి.త్రినాధరావు ప్రారంభించారు. ముమ్మిడివరం, రామచంద్రపురం నియోజకవర్గాల నుంచి 36 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయని నిర్వాహకులు టేకుమూడి సత్యనారాయణ తెలిపారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. అయినాపురం, సీతారామపురం జట్లు, కోరంగి, తాళ్ళరేవు జట్ల మధ్య ఆసక్తికరమైన పోటీ జరిగింది. ఈ సందర్భంగా లక్కీ డిప్ విజేతలకు హెల్మెట్లు అందజేశారు. యువకులు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తహసిల్దార్ త్రినాధ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డి.సి. వైస్ ఛైర్మన్ కొత్తూరు కాశీఈశ్వరుడు, కూటమి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, మాజీ జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, భజన సత్తిబాబు, గుత్తుల సూర్యనారాయణ, గంజా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెసి రాహుల్‌మీనా

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బోట్ క్లబ్ వద్ద గల ఆమె విగ్రహానికి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎంఎల్‌ఎ పంతం నానాజీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శాలివాహన సంఘం ప్రతినిధులు ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి రాహుల్ మీనా మాట్లాడుతూ 15వ శతాబ్దంలో సమాజంలోని అసమానతులను సైతం ఎదిరించిన వీర వనిత మొల్లమాంబ అని అన్నారు. పండితులకే కాకుండా పామరులకు అర్ధమయ్యే రీతిలో రామాయణాన్ని రచించి ప్రజలకు అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి కె.లిల్లీ, బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాసరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి డి.నాగార్జున, తహశీల్దార్ ఎస్‌ఎల్‌ఎన్.కూమారి, శాలివాహన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సివిల్ సప్లై టెక్నికల్ టీం సభ్యులు దుర్గాప్రసాద్, సురేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు ధాన్యం కొనుగోలు యాప్, నాణ్యత ప్రమాణాలు గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. రబీలో ధాన్యం జగన్నాథగిరి గ్రామంలోని రఘురామ రైస్ మిల్లులో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సహాయ సహాయకులు, సిబ్బంది ఎటువంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని ఎఒ అశోక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వేంకటేశ్వర రావు, విఆర్‌ఒలు, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

నేరాలు ఘోరాలు


ప్రమాద ఘటన ప్రాంతం

రోడ్డు ప్రమాదంలో నానమ్మ, మనవడు మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి, గోపాలపురం

మండలంలోని దుద్దుకూరు ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాలపురం గ్రామానికి చెందిన నానమ్మ, మనవడు షేక్ మీరా తస్లీమా(65), షేక్ సమీర్(17) మృతి చెందారు. దేవరపల్లి ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ మీరా తస్లీమా_ సమీవుల్లా భార్యాభర్తలు. వీరి కుమార్తె అనారోగ్యంతో జీవిస్తూ మరణించింది. ఈ నేపథ్యంలో కీడు బట్టలు పెట్టేందుకు మీరా తస్లీమా గోవర్గనిమెట్టలో ఉంటున్న సోదరుడు ఆహ్వానించారు. దీంతో మీరా తస్లీమా తన మనవడు షేక్ సమీర్‌ను తీసుకుని బైక్‌పై పంగిడి వద్ద ఉన్న గోవర్గనిమెట్టకు తమ్ముడి ఇంటికి వెళ్లింది. కార్యక్రమం ముగించుకుని తిరిగి గోపాలపురం పయనమయ్యారు. దుద్దుకూరు వద్దకు వచ్చేసరికి లారీని వెనకవైపు బలంగా వీరి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో రాజమండ్రి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. దీంతో గోపాలపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమీర్ స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ సిఇసి ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. శివారం ఒక పరీక్ష రాస్తే ఇంటర్మీడియట్ పూర్తవుతుందనకున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమీర్ తండ్రి రియాజ్ వడ్రంగి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సెలవు రోజుల్లో సమీర్ తండ్రికి చేదుడు వాదోడుగా ఉంటున్నాడు. గురువారం పరీక్షకు సెలవు కావడంతో తన నానమ్మను తీసుకుని వెళ్తుంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఆక్సిజన్ అందక శిశువు మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

ఆక్సిజన్ అందక మూడురోజుల నవజాత శిశువు గురువారం మృతి చెందింది. దీనిపై ఆసుపత్రి వద్ద శిశువు కుటుంబ సభ్యులు, బంధువులు అందోళన చేశారు. వివరాలు ఇవి. .రావులపాలెం కొత్త కాలనీకి చెందిన మార్గాని వీరబాబు, భార్య కనకమహాలక్ష్మి దంపతులకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెండవకాన్పులో మగబిడ్డ జన్మించింది. శిశువు కు గురక వస్తుందని కొత్తపేట శివారు పోస్ట్ ఆఫీస్ సమీపంలోని ఒక ప్రయివేటు చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చాలంటూ వైద్యులు సూచించారు. ఈమేరకు మంగళవారం చేర్పించినట్లు సమాచారం. చికిత్స అనంతరం గురువారం పంపిస్తామని చెప్పిన ఆసుపత్రి సిబ్బంది తండ్రి వీరబాబుకు ఫోన్ చేసి శిశువుకు సీరియస్‌గా ఉందని రాజమహేంద్రవరంలోని చిన్నపిల్లల ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిసింది. గురువారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రి వైద్యులు శిశువును పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించినట్లు శిశువు బంధువులు తెలిపారు. బుధవారం రాత్రి శిశువుకు సిబ్బంది ఆక్సిజన్ అందించడంలో నిర్లక్ష్యం వహించారని శిశువు తల్లిదడులు, బంధువులు ఆరోపించారు. దీంతో గురువారం చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని తండ్రి, వైద్యులను వివరాలు తెలుసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ ఆసుపత్రిలో వైద్యం సరిగా అందక గతంలో కూడా కొంతమంది శిశువులు చనిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రోడ్డు ప్రమాదంలో గురువారం వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన అరుగుల చంద్రరావు(83) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం మండలంలోని ర్యాలి గ్రామంలో బంధువుల ఇంటి లో జరుగుచున్న కార్యక్రమానికి లక్ష్మీ పోలవరం నుంచి నడుచుకుంటూ ర్యాలి గ్రామం వస్తున్నాడు. ఈ సమయంలో జిమ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి కృషి ట్రాక్టర్ అతి వేగంతో చంద్రరావును వెనుక వైపు నుండి ఢీకొంది. ఈ ఘటనలో రోడ్డు మీద పడి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రరావు మనవడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని నర్సిపూడిలో నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. నాటు సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నర్సిపూడికి చెందిన గుత్తుల సుబ్బారావు 20 లీటర్లు నాటు సారాతో పట్టుబడ్డాడన్నారు. అతనిని నుంచి స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి ఆలమూరు కోర్టులో హాజరుపరచామన్నారు. నిందితుడు సుబ్బారావుకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ప్రజాశక్తి - సీతానగరం

అదనపు కట్నం కోసం వేధింపులపై వివాహిత సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన సిహెచ్.మోహన రావు కుమారుడు వెంకటేష్‌తో రఘుదేవపురం గ్రామానికి చెందిన సృజనకు 2021లో వివాహం అయ్యింది. కొంత కాలం వారి కాపురం సజావుగానే సాగింది. ఇటీవల కొన్ని నెలలుగా భర్త వెంకటేష్, అత్త సదాలక్ష్మి, ఆడపడుచు దుర్గా ఆమె భర్త పాలిశెట్టి రఘుబాబు అదనప కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్నారు వేధింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి వచ్చేసింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

15న స్వచ్ఛాంధ్రా- స్వర్ణాంధ్రా నిర్వహణ

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 15న ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన యాప్ నందు స్వచ్ఛంధ్ర కార్యక్రమ వివరాలను నమోదు చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రతినెల 3వ శనివారం ఒక అంశాన్ని ప్రామాణికంగా తీసుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ఈనెల 15వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రార్థనలు, ఆర్‌టిసి బస్టాండ్, కూరగాయలు మార్కెట్, మార్కెట్ యార్డు, రైతు బజార్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో చెత్తను సేకరించి చెరువులను ఈ కార్యక్రమంతో పరిశుభ్రపరచాలన్నారు. పర్యావరణానికి హాని లేని వస్తువులను మాత్రమే ప్రజలు వినియోగించేలా చైతన్యవంతులను చేయాలన్నారు.

తాడేపల్లికి ఛైర్‌పర్సన్ మార్పు అంశం

-బొత్సను కలిసిన 23 మంది వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సామర్లకోట


మాజీ మంత్రి బొత్సను కలిసిన కౌన్సిలర్లు

సామర్లకోట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి మార్పు అంశం తాడేపల్లికి చేరింది. గత రెండు నెలలుగా అంతర్గతంగా ఛైర్‌పర్సన్ మార్పుపై చర్చలు జరుగుతున్నాయి. ఛైర్‌పర్సన్ మార్పుకు అనుమతించాలని ఇద్దరు వైస్ ఛైర్మన్‌లు సహా 23 మంది వైసిపి కౌన్సిలర్లు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను తాడేపల్లిలో కలిశారు. ఈనెల 17వ తేదీతో మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్ల పూర్తవుతున్న క్రమంలో ఛైర్‌పర్సన్ పదవి దక్కించుకోవాలని ఆశిస్తున్న అదే వర్గానికి చెందిన మహిళా కౌన్సిలర్ 23 మంది వైసిపి కౌన్సిలర్లను అధిష్టానం వద్దకు సొంత ఖర్చులతో తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. ఛైర్ పర్సన్ మార్పునకు మాజీ మంత్రి బొత్స అంగీకారం తెలిపినట్లు సమాచారం. నాలుగేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్‌పర్సన్‌గా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరు దొరబాబు తల్లి దౌలూరు పార్వతి ఎన్నిక కావాల్సి ఉంది. అయితే ఒక ఇంట్లో ఒకే పదవి ఉండాలన్న జగన్ ఆదేశాలతో అప్పటికప్పుడు ఛైర్‌పర్సన్‌గా గంగిరెడ్డి అరుణను ఎన్నిక చేశారు. కౌన్సిల్లో 31 మంది సభ్యులకు గాను 29 మంది వైసిపి సభ్యులు ఉండగా ఇద్దరు టిడిపి సభ్యులు ఉన్నారు. సాధారణ ఎన్నికల సమయంలో ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు పిల్లాడి సత్యవతి, పితాని కృష్ణలు టిడిపికి మద్దతు ఇచ్చారు. దవులూరి పార్వతికి ఛైర్‌పర్సన్ పదవి ఇస్తే తాను తప్పకుండా పూర్తి సహకారం అందిస్తానని మరొక అభ్యర్థిని ఎంపిక చేస్తే వైదొలకేది లేదని ప్రస్తుత ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ చెబుతున్నట్లు సమాచారం. దీంతో చేసేది లేక ఛైర్‌పర్సన్ పదవిని ఆశించే వర్గం అధిష్టానం వద్దకు విషయాన్ని తీసుకెళ్లారు. ఏడాది పాలన కోసం ఛైర్‌పర్సన్ మారుస్తారా లేక అరుణను కొనసాగిస్తారా? అనే అంశం నేడు చర్చానీయాంశంగా మారింది.

ఉత్తరకంచి డ్వాక్రాలో సొమ్ము మాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని ఉత్తర కంచి గ్రామ సదాశివ డ్వాక్రా సంఘం ఎస్‌బిఐ పొదుపు ఖాతాలో సొమ్ము మాయమైంది. సదాశివ గ్రూపు పొదుపు ఖాతాలో రూ.2,41,000 సొమ్ము పొదుపు ఉండాలి. అయితే 45 రోజుల వ్యవధిలో యుపిఐ ద్వారా రూ.2,40,000 గల్లంతయినట్లు గురువారం గుర్తించారు. ప్రతి డ్వాక్రా గ్రూపు నుంచి సురక్ష యోజన, జీవన యోజన పథకాలను బ్యాంకు వారే రెన్యువల్ చేస్తారు. ఇందుకోసం పొదుపు ఖాతాలో రెండు లక్షలైనా ఉండాలి. బ్యాంక్ మేనేజర్ లలిత్ ఈ పథకాలను రెన్యువల్ చేసేందుకు ఖాతాలను పరిశీలిస్తే రూ.760 ఉన్నాయి. ఈ మోసాన్ని డ్వాక్రా సంఘం అధ్యక్ష కార్యదర్శులు దృష్టికి తీసుకొచ్చారు. సొమ్ము మాయంపై సదాశివ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొట్టేటి పార్వతి, చింతల నాగమణి తదితరులు ఎపిఎం వై.వెంకట్‌కు ఫిర్యాదు చేశారు. బ్యాంక్ అధికారులు సైబర్ క్రైమ్ జరిగినట్లు గుర్తించి పై అధికారులకు వివరించారు. సంఘం సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయనట్లు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - కిర్లంపూడి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని రాజుపాలెం నుంచి రామవరం వరకు జరిగే రోడ్డు విస్తరణ పనులను డిఇఇ రాఘవరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.29 కోట్లతో రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. చెరువు వైపు రోడ్డు విస్తరణ పెంచాలన్నారు. రాజుపాలెం ముందు భాగంలో పది అడుగులు రోడ్డు రావడంతో ఖాళీ చేయవలసిన వాటికీ మార్కింగ్ ఇచ్చామన్నారు. వీరవరం ముందు భాగంలో ఖాళీ చేయవలసిన ప్రదేశాలకు మార్కింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఎంపిపి తోట రవి, తోట గాంధీ, మాజీ ఎంపిటిసి గొడె దొరబాబు, ఎఇఇ సత్యశివప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రౌతులపూడి

వెనకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారులకు రుణాలు అందజేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ శివరామకృష్ణయ్య గురువారం ఒక ప్రకటన లో తెలిపారు ఆయా దరఖాస్తులను సమీపంలోని సచివాలయం, మీ సేవ కేంద్రంలో చేసుకోవాలని సూచించారు.

పారిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్ల అందజేత

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రూరల్ మండలంలోని ఐదు గ్రామాలకు స్వచ్ఛఆంధ్ర పథకంలో నూతన ట్రాక్టర్లు మంజూరైనట్లు ఎంపిపి గొల్లపల్లి బుజ్జి తెలిపారు. గురువారం ఆయా గ్రామ సర్పంచులకు ట్రాక్టర్లను అందజేశారు. అనంతరం ప్రకతి వ్యవసాయ రైతులకు డ్రమ్ములు, పోనీ బరకాలు, విత్తనాలు అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికులు కుటుంబాలకు ఒక్కొకరికి రూ.50 వేలు చొప్పున చెక్కులు అందజేశారు.


మీసాల వెంకన్న రథయాత్రలో పాల్గొన్న యాత్రికులు

ఘనంగా మీసాల వెంకన్న రథయాత్ర

ప్రజాశక్తి - యానాం

మీసాల వెంకన్న కళ్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం రథయాత్ర వైభవంగా జరిగింది. కశిరెడ్డి వెంకటకృష్ణయ్య, సత్య వీర వెంకన్న, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు సోదరులచే ఈ యాత్రను నిర్వహించారు. సాయంత్రం 5.10 నిమిషాలకు ఆర్ఎఒ మునిస్వామి, ఇఒ లక్ష్మీ వెంకటేశ్వరరావు తదితరులు రథం వద్ద విశేష పూజలు నిర్వహించారు. మేళతాళాలతో భాజా భజంత్రీల మధ్య రథయాత్ర చిన్న సెంటర్ నుంచి బయలుదేరి పిల్లారాయ వీధి మీదుగా కొత్త బస్టాండ్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వర్తక సంఘ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలో గోపాల్ నగర్‌లో నివాసప్రాంతాల మధ్య భారీస్థాయిలో జరుగుతున్న పేకాట శిబిరంపై గురువారం ఎస్‌పి రాజశేఖరన్ ఆదేశాలతో సిఐ షణ్ముగం ఆధ్వర్యంలో పోలీసులు మెరుపుదాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న 24 మందిని అరెస్ట్ చేశారు. స్థానిక తిరుమల రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో గోపాల నగర్ పరిధిలోని మొదటివీధి శ్రీరామ్ నగర్‌లో గోకవరపు కాశీవిశ్వనాధరావు నివాసంలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఈ దాడిని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. 24 మందిని అరెస్ట్ చేయడంతో పాటు, నగదు రూ.15,900, పేకాటకు ఉపయోగించే 61 క్వాయిన్స్, రెండు సెట్ల కార్డు బాక్సును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

23వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలి


23వ డివిజన్ లో పర్యటిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని 23వ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ప్రజాచైతన్య యాత్ర బృందం డిమాండ్ చేసింది. గురువారం సాయంత్రం సిపిఎం బృందం డివిజన్ పరిసరాల్లో పర్యటించగా స్థానికులు అనేక సమస్యలను బృందం దృష్టికి తెచ్చారు. దోమలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్‌లో తరచూ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. పార్కు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. మున్సిపల్ కార్మికుల క్వార్టర్స్‌లోని 42 గృహాలు పూర్తి చేయాలని కోరారు. రెల్లి యువకులు ఉపాధి కొరకు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి అయినా అమలు చేయాలన్నారు. కొత్తగా పెళ్లయిన వారికి రేషన్ కార్డు మంజూరు న ం ల బ. ˇ త ˇ ం ం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర నగర కమిటీ సభ్యులు మనక వెంకటరమణ, కె.సత్తిరాజు, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాణి, స్థానికులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

కుట్టు శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జె.రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో కుట్టు శిక్షణపై ఆసక్తి గల అభ్యర్థులకు శుక్రవారం నుంచి శిక్షణను ప్రారంభిస్తామని తెలిపారు. ఒసి, బిసి అభ్యర్థులు ఇప్పటికే సుమారు 200 మంది కుట్టు శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. వీరికి కాజులూరు మహిళా శక్తి భవనంలోనూ, గొల్లపాలెంలో సచివాలయ భవనంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా 30 రోజులు పాటు శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు ఎవరైనా ఆసక్తిగలవారు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే శిక్షణా కేంద్ర వద్ద రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు 50 సంవత్సరాలు లోపు ఉండాలని, ఆధార్ కార్డు , రేషన్ కార్డు తీసుకురావాలని ఆయన కోరారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

ట్రాన్స్‌పోర్ట్ పార్శిల్ ఉల్లిపాయల బాంబుల ప్రేలుడులో మృతి చెందిన జట్టు కార్మికుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 50శాతం కాలిపోయి ఐసియులో 10రోజులు నరక యాతన అనుభవించి మృతి చెందిన గజ్జిల మద్దిలేటి కుటుంబానికి సంబంధిత పార్శిల్ యాజమాన్యం నేటికీ ఆదుకోకపోవడం దారుణమన్నారు తక్షనమే మృతిని పిల్లలకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం సైతం మృతిని భార్యకు ఇంటి స్థలంతోపాటు, కాంట్రాక్ట్ ఉద్యోగం కల్పించి ఉపాధి కల్పించాలని కోరారు.

పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు తాతగారి కుటుంబ సభ్యుల గ్రూప్ ప్రతినిధులు గురువారం పరీక్షల సామాగ్రిని అందజేశారు. గ్రూపు సభ్యుల సహకారంతో పరీక్ష అట్ట, స్కేల్, రెండు పెన్నులు, హాల్ టికెట్ కవర్, పెన్సిల్, రబ్బరు, షార్ప్‌నర్ లతో కూడిన కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ ప్రతినిధి రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎ.సూర్యనారాయణ మూర్తి, ఉంగరాల రవీంద్ర మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి బాబి, బల్ల చిరంజీవి, హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ధూళిపూడి సుభ, విశ్వ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జూనియర్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ కళాశాలలో జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జగ్గంపేటలో 3 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 496 మంది కి 474 మంది హాజరు కాగా 22 మంది గైర్హజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. అక్షర కళాశాలలో 387 మందికి 374 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఆళ్ళ రవికిషోర్ తెలిపారు. గురుకుల పాఠశాలలో 363 మంది కి 342 మంది హాజరు కాగా 21 మంది గైర్హజరయినట్లు ప్రిన్సిపల్ రాజకుమారి తెలిపారు.

'యాంటీనా రూపకల్పన, అనువర్తనాల' వర్క్ షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'యాంటీనా రూపకల్పన మరియు అనువర్తనాలు" అనే అంశంపై ఒక రోజు వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు కమ్యూనికేషన్, రాడార్, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలలో యాంటెన పరిజ్ఞానం యొక్క ఆవశ్యకతపై వివరించారు. జెఎన్‌టియుకె అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలిశెట్టి రమాదేవి మాట్లాడారు.